

యార్డుకు 2 వేల క్వింటాళ్ల పత్తి

ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శనివారం 2,078 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి వచ్చింది. గరిష్ట ధర రూ.7,620 పలికింది. నగదు ధర రూ.7,289, కనిష్ట ధర రూ.5,380గా పలికింది.



'ప్రైవేటు' దోపిడీ

ప్రయాణికుల అవసరాన్ని ఆసరా చేసుకుని కొందరు ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు దోచుకుంటున్నారు. సాధారణ చార్జీల కంటే అధికంగా వసూలు చేస్తున్నాయి.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,623.66
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 72.183
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 0
అవుట్ ఫ్లో	: 9,690

న్యూస్‌రీల్

పలువురు డిప్యూటీ కలెక్టర్లకు స్థానభ్రంశం

కర్నూలు (సెంట్రల్): పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డిప్యూటీ కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం స్థానాలను కేటాయించింది. ఈ మేరకు శనివారం జీవో ఆర్‌టీ నెం.66ను విడుదల చేసింది. జాతీయ రహదారుల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న టి.చిరంజీవిని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా నియమించింది. ఆయన స్థానంలో జాతీయ రహదారుల ఎస్‌డీసీగా పదోన్నతి పొందిన ఆర్.వి.సుమిత్రా బాయిని నియమించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 ఎస్‌డీసీగా కె.అనురాధను నియమించారు. ఈమె వైఎస్సార్ జిల్లా డీపీఎం డీఎంగా పనిచేస్తున్నారు. పదోన్నతి పొందిన పి.రామాంజనమ్మను అనంతపురం హెచ్‌పీసీఎల్ కాంపిటెంట్ అథారిటీగా నియమించారు. అలాగే పదోన్నతి పొందిన జె.శివశంకర్ నాయక్‌ను తిరుపతి ప్రొటోకాల్1 డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు.

రేపటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని 13వ తేదీన రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగలో భాగంగా బోగి వేడుకల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయానికి సెలవు ఉండడంతో పీజీఆర్‌ఎస్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

వీరభద్రా.. మా కష్టాలు వినవా!



వీరభద్రగౌడ్‌ను నిలదీస్తున్న మహిళలు

ఆస్పరి: తమ సమస్యలు పరిష్కరించాలని అట్టికల్లు గ్రామంలోని దళిత కాలనీకి చెందిన మహిళలు టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్‌ను నిలదీశారు. శనివారం మండలంలోని అట్టికల్లు గ్రామంలో గోకుల షెడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు మహిళలు సమస్యలు ఏకరువు పెట్టారు. వంద ఇళ్లు ఉన్న కాలనీలో మంచి నీటి సమస్య నెలకొందని, సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. వర్షాకాలంలో వాన నీరు నిలిచి ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకుంటుందని చెప్పారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వీరభద్రగౌడ్ తెలిపారు.

శాస్త్రోక్తంగా కూడారై ఉత్సవం



యాగశాలకు వేంచేస్తున్న గోదాదేవి అమ్మవారు


ఆళ్లగడ్డ: శ్రీ మద్ అహోబిల క్షేత్రంలోని ప్రహ్లాద వరదస్వామి సన్నిధిలో ధనుర్మాస పూజలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. 27వ రోజైన శనివారం కూడారై ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలమూర్తులైన శ్రీప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను యాగశాలలో కొలువుంచి నవకలశ స్థాపన, అభిషేకం, పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. తర్వాత ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామి, ఆండాల్ అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో 108 గంగాళాల్లో (పాత్రలు) 108 రకాల్లో వండిన పాయసాలు (ప్రసాదాలు)తో కూడారై ఉత్సవం నిర్వహించారు.

బతుకు భారమాయె.. పండుగ దూరమాయె!

- ప్రకృతి వైపరీత్యాలతో పంటలు పండక నష్టపోయిన రైతులు
- పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు
- నాటి ప్రభుత్వానికి, నేటి ప్రభుత్వానికి ఎంతో తేడా
- అమలు కాని సూపర్–6 హామీలు
- అధ్వానంగా సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం
- కొనుగోలు సామర్థ్యం లేక సంక్రాంతి వెలవెల

గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందడి కనిపించడం లేదు. పట్టణాల్లో కొనుగోళ్లు తగ్గిపోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు పూర్తి అయినా సూపర్– 6 హామీలు అమలు కాలేదు. సంక్షేమ పథకాల ఊసే లేదు. చేతిలో డబ్బుల్లేక ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకపోవడంతో పండుగ వేళ సామాన్య ప్రజలందరికీ వేదనే మిగిలింది.





కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటలు ఇంటికి వచ్చిన తర్వాత జరుపుకునే మొదటి పండుగ సంక్రాంతి. పండుగ రోజున అన్ని రకాల పంటలతో గ్రామాలు కళకళలాడుతాయి. అయితే నేడు జిల్లాలో ఎటూ చూసినా గ్రామాలు కళ కోల్పోయి.. వెలవెలబోతున్నాయి. అధిక వర్షాలు, వర్షాభావంతో పంట దిగుబడులు పడిపోయాయి. వాటికి మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదు. జిల్లాలో 3,05,298 మంది రైతులు ఉండగా, వీరిలో 80 శాతం మంది కష్టాల్లో కూరుకుపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు పూర్తవుతున్నా రైతులకు, ఇతర వర్గాలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదు. ఎన్నికల సమయంలో సూపర్–6లో భాగంగా రైతులకు ఏడాది రూ.20 పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. తల్లికి వందనం పేరుతో ఊరించారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఏడాదికి 15 వేలు చెల్లిస్తామని నమ్మించారు. పొదుపు మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. ఆడబిడ్డలకు నెలకు రూ.1500 చెల్లిస్తామంటూ ఆశ పెట్టారు. అరచేతిలో స్వర్గం చూపి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. నేడు వీటిని గురించి పట్టించుకునే దాఖలాలే లేవు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలా..

2019–20 నుంచి 2023–24 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేసింది. 2019 మేలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే చెప్పిన మాట ప్రకారం హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. ఐదేళ్లు సంక్షేమ పథకాలు అమలయ్యాయి. వైఎస్సార్ రైతుభరోసా, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ నేతన్న నేస్తం, విద్యాదీవెన, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం.. ఇలా అనేక పథకాలు అమలయ్యాయి. ఒక్కో కుటుంబానికి సగటున ఏడాదికి రూ.75 వేల నుంచి లక్ష వరకు నగదు ప్రయోజనం లభించింది. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి రూ.3,500 కోట్ల వరకు నగదు నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేది. రైతులు పండించిన పంటలకు ధరలు లేనప్పుడు ఆర్‌బీకేల వారీగా కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరలతో కొనుగోలు చేసింది. అప్పట్లో ప్రజల్లో కొనుగోలు సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగింది.

నేడు పరిస్థితి ఇదీ..

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఎన్నో చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించింది. దీంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల ఊసే లేకపోవడంతో అన్ని వర్గాల ప్రజల్లో కొనుగోలు సామర్థ్యం పడిపోయింది. జీఎస్‌టీ ద్వారా రాష్ట్రానికి వచ్చే ఆదాయం 18 శాతం వరకు పడిపోయింది. వంట నూనెలు, కంది పప్పు, మినపప్పు తదితర నిత్యావసర వస్తువుల ధరలు 40 నుంచి 50 శాతం వరకు పెరిగాయి. లీటరు పామాయిల్ ప్యాకెట్ ధర రూ.150 వరకు ఉందంటే ధరలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టం అవుతోంది. 2023–24 రబీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 12 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జూన్ 19, 20 తేదీల్లో సెంట్రల్ టీమ్ పర్యటించి కర్నూలు జిల్లాకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.58.28 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.37.76 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద కేంద్రం రాష్ట్రానికి నిధులు ఇచ్చినప్పటికీ రాష్ట్రం మాత్రం కరువు రైతులను విస్మరించింది. 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పరిహారం చెల్లించకుండా కూటమి ప్రభుత్వం అవరోధాలు కల్పించింది. పండించిన పంటలకు గిట్టుబాటు కాదు గదా.. కనీసం మద్దతు ధర కూడా లభించడం లేదు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలో 32 మంది, నంద్యాల జిల్లాలో 20 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

వంట నూనెలపై పెరిగిన ధరలు...

2024 జూన్ వరకు పామాయిల్, పొద్దుతిరుగుడు నూనెల ధరలు లీటరు రూ.100 వరకే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముడి సరుకు దిగుమతిపై భారీగా పన్నులు పెంచడంతో వంట నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం లీటర్ పామాయిల్ ధర రూ.140, పొద్దుతిరుగుడు నూనె ధర రూ.150 వరకు ఉంటోంది. లీటర్‌పై 50 శాతం వరకు ధరలు పెరిగాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పథకాలు ఇలా ఉండేవి..

- **జనవరి:** చివరి దఫా రైతు భరోసా, చిరు వ్యాపారులకు జగనన్న తోడు, సంక్రాంతి సమయానికి అక్క చెల్లెమ్మలకు ఆసరా డబ్బులు
- **ఫిబ్రవరి:** విద్యా దీవెన, జగనన్న చేదోడు
- **ఏప్రిల్:** వసతి దీవెన, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు సున్నా వడ్డీ
- **మే:** జగనన్న విద్యా దీవెన, రైతులకు ఉచిత పంటల బీమా, రైతు భరోసా, మత్స్యకారులకు మత్స్యకార భరోసా, డీజిల్ మీద సబ్సిడీ కార్యక్రమం
- **జూన్:** అమ్మ ఒడి
- **జూలై:** వాహనమిత్ర, కాపునేస్తం, చిరువ్యాపారులకు జగనన్న తోడు
- **ఆగస్టు:** జగనన్న విద్యాదీవెన, నేతన్న నేస్తం
- **సెప్టెంబర్:** వైఎస్సార్ చేయూత
- **అక్టోబర్:** వైఎస్సార్ రైతు భరోసా రెండో విడత
- **నవంబర్:** జగనన్న విద్యాదీవెన, రైతులకు సున్నా వడ్డీ డబ్బులు
- **డిసెంబర్:** ఈబీసీ నేస్తం, లా నేస్తం, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు

బంగారం వ్యాపారం పడిపోయింది

2020 నుంచి 2023 వరకు బంగారు వ్యాపారం సంతృప్తికరంగా ఉండేది. సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో నగదు పరపతి పెరిగింది. సాధారణ, మధ్య తరగతి ప్రజలు చిన్నచిన్న బంగారం వస్తువులను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు బంగారం వ్యాపారం పడిపోయింది. – పుణ్యమూర్తి రామయ్య, మాజీ అధ్యక్షుడు, కర్నూలు జ్యువెలరీ అసోసియేషన్

దయనీయంగా ఉంది



మాకు 12 ఎకరాల భూమి ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడులు పడిపోయాయి. అంతంత మాత్రం పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. వ్యవసాయం కలిసి రాక పోయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు. సూపర్–6లో భాగంగా రైతులకు ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ప్రకటించారు. దాన్ని వెంటనే అమలు చేయాలి.
– బాబునాయక్, వైజీ తండా, తుగ్గలి మండలం

కష్టాల్లో ఉన్నా చేయూత ఏదీ?



మేము ఖరీఫ్‌లో పొగాకు, మొక్కజొన్న, కంది, ఉల్లి తదితర పంటలు సాగు చేశాం. పంటలు దెబ్బతిని కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన కూడా కరువైంది. 2023–24 రబీ కరువు మండలాల రైతులకు ప్రభుత్వం పైసా కూడా విదిల్చలేదు. ఉచిత పంటల బీమాకు మంగళం పలకడం రైతులను దెబ్బతీయడమే. రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.
– బాలపీరా, ఈ. తాండ్రపాడు, కర్నూలు మండలం

కనిపించని సంక్షేమం



ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు సూపర్–6 అంటూ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు అవుతోంది. ఇంతవరకు ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదు.అధిక వర్షాలు, అనావృష్టితో వ్యవసాయం కలసి ప్రజల ఆర్థిక సామర్థ్యం తగ్గిపోయింది. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా సూపర్–6 హామీలను తప్పకుండా అమలు చేయాలి.
– జి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ఆర్థిక భారం పెరిగింది




మేం ప్రైవేట్ ఉద్యోగం చేస్తాం. ఎనిమిది నెలల క్రితం నిత్యావసర వస్తువులకు నెలకు 4 వేల వరకు ఖర్చు అయ్యేది. నేడు అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో ఆర్థిక భారం పెరిగింది. డిసెంబరు నెలలో నిత్యావసర వస్తువులకు రూ.7 వేలకు పైగా ఖర్చు వచ్చింది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి.
– షేక్ షాకి రా సుల్తాన, కర్నూలు

కోడిపందేలు జరిగితే 77778 77722కు సమాచారం ఇవ్వండి

కర్నూలు: జిల్లాలో ఎక్కడైనా కోడిపందెం, జూదం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే స్థానిక పోలీసులు లేదా డయల్ 100, డయల్ 112 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 7777877722కు సమాచారం అందించాలని ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ అంటూ జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, శివారు ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట వంటి జూదాలు ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసై కేసుల్లో ఇరుక్కుని ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఉద్యోగాలు పొందే సమయంలో, పాస్‌పోర్టు పొందే సమయంలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

వడ్డే ఓబన్న పోరాటం స్ఫూర్తిదాయకం



వడ్డే ఓబన్నకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతిని జనవరి 11న అన్ని జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. శిస్తు వసూలు విషయంలో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులకు, రేనాటి పాలెగాళ్లకు మధ్య ప్రారంభమైన ఘర్షణల సందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో వడ్డె ఓబన్న సైన్యాధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామానికి ముందే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలసి వడ్డె ఓబన్న వీరోచితంగా పోరాడారన్నారు. సమాజ హితం కోసం వడ్డె ఓబన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, వడ్డె కులమునకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్న ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధరలు మరింత పడిపోతున్నాయి. 2024లో పండించిన ఉల్లి ధర గరిష్టంగా రూ.5,000 దాటింది. బంగ్లాదేశ్‌కు ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించడం ధరలపై ప్రభావం చూపుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పండించిన ఉల్లిలో 60 శాతం పశ్చిమ బెంగాల్‌కు వెళ్లేది. అయితే ఆ రాష్ట్రం ఉల్లి దిగుమతులను అడ్డుకుంది. దీంతో ఉల్లి ధరలు పతనం దిశగా సాగుతున్నాయి. దీనికి తోడు వ్యాపారులు సిండికేట్‌గా మారుతుండటం కూడా రైతులు నష్టపోవడానికి కారణమవుతోంది. శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 868 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. కనిష్ట ధర రూ.538, గరిష్ట ధర రూ.2,469 లభించింది. సగటు ధర రూ.1,639 మాత్రమే నమోదైంది. సగటు ధరను పరిశీలిస్తే రైతులకు రూ.1000 నుంచి రూ.1600 వరకు మాత్రమే లభిస్తోంది. ఉల్లి ధరలు క్రమంగా తగ్గుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎండుమిర్చి ధరలు నిరాశజనకంగా ఉంటున్నాయి. మార్కెట్‌కు 407 క్వింటాళ్ల మిర్చి వచ్చింది. కనిష్ట ధర రూ.2,099, గరిష్ట ధర రూ.13,709 లభించగా... సగటు ధర రూ.9,300 నమోదు అయింది. మార్కెట్‌కు కందులు వెల్లువెత్తుతున్నాయి. 557 మంది రైతులు 3,929 క్వింటాళ్లు తెచ్చారు. కనిష్టంగా రూ.3,001, గరిష్టంగా రూ.7,609 లభించగా.. సగటు ధర రూ.7,039 నమోదైంది.



పీఆర్ ఇంజినీరింగ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

సెలవుల్లోనూ పని ఒత్తిడి!

- రెండో శనివారం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు
- మిస్సింగ్ సిటిజన్ సర్వేలో సచివాలయ ఈఏలు



సెలవు రోజులో సర్వేపై శిక్షణకు హాజరైన వార్డు సచివాలయాల ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పని ఒత్తిడి అధికమైందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో శనివారం, ఆదివారం కలసి రావడంతో సంక్రాంతి పండుగకు ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు రోజులు సెలవులు వచ్చాయి. ఈ ఐదు రోజులు సొంత ఊర్లకు, క్షేత్రాలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి సంతోషంగా గడిపి రావాలనే ప్రణాళిక వారికి ఉంటుంది. అయితే వివిధ ప్రభుత్వ శాఖల మాటెలా ఉన్నా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో మాత్రం సెలవు రోజైన రెండో శనివారం కూడా ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఎఫ్‌టీఏలు అప్‌లోడ్ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగంగా పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉద్యోగులు రెండో శనివారం కూడా కార్యాలయాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు.

మిస్సింగ్ సిటిజన్ సర్వేలో సచివాలయ ఈఏలు ...

గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కూడా సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహిస్తున్నారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, నాన్ రెసిడెంట్ ఆఫ్ ఏపీ సర్వే పేరుతో నిర్వహిస్తున్న సర్వేలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని పైఅధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవు రోజుల్లో అధిక శాతం మంది ప్రజలు ఇళ్ల వద్ద అందుబాటులో లేకుంటే, సర్వే ఎలా చేయగలమని వారంటున్నారు. ఇళ్ల వద్ద ప్రజలు అందుబాటులో ఉంటే వారి వివరాలను నమోదు చేసే క్రమంలో వారికి ఓటీపీ వస్తుందని, వచ్చిన ఓటీపీ మేరకు వివరాలను సేకరించాల్సి ఉంటుందని, ప్రస్తుత సెలవు రోజుల్లో ప్రజలు అందుబాటులో లేకున్నా సర్వే పూర్తి చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు నగరంలో..

కర్నూలు (టౌన్): ప్రభుత్వ కార్యాలయాలకు రెండో శనివారం సెలవు. పైగా ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. అయినా కర్నూలు కార్పొరేషన్ నూతన కౌన్సిల్ హాలులో 200 మందికి పైగా వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వేపై శిక్షణ ఇచ్చారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 136 సచివాలయాల్లో ఉద్యోగులు ఇప్పటికే 1,24,419 ఇళ్లలో సర్వే వివరాలు పూర్తి చేశారు. ఈనెల 15 వ తేదీలోపు మిగిలిన 15.21 శాతం సర్వే చేయాల్సి ఉంది. పై నుంచి ఆదేశాల రావడంతో సెలవుల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. సెలవులు ముగిసిన తరువాత ఎలాగు పనిచేయాల్సిందే కదా అన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మోత్సవం..సకల దేవతలకు ఆహ్వానం

- శ్రీశైలంలో మకర సంక్రాంతి ఉత్సవాలకు అంకురార్పణ
- పంచాహ్నికదీక్షతో శాస్త్రోక్తంగా ఏడురోజుల పాటు వేడుకలు



మల్లన్న ఆలయంలో ధ్వజ పటావిష్కరణ దృశ్యం



చండీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభంపై పతాకావిష్కరణతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. సంప్రదాయాన్ని అనుసరించి మల్లికార్జునస్వామికి ఏటా రెండుసార్లు అనగా మకర సంక్రమణం సందర్భంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. బ్రహ్మోత్సవ ప్రారంభ సూచకంగా దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు దంపతులు, అధికారులు, ఆలయ అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా శనివారం ఉదయం యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం వేదపండితులు వేదపఠనంతో వేదస్వస్తి నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు బ్రహ్మోత్సవ సంకల్పం పఠించారు. గణపతిపూజ, వృద్ధి, అభ్యుదయాల కోసం స్వస్తి పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం బ్రహ్మోత్సవ నిర్వహణకు ఆధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేష పూజలు చేశారు. చండీశ్వర అర్చన తరువాత కంకణాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ ఈఓ, అధికారులు, అర్చకస్వాములు, స్థానాచార్యులు కంకణాలు ధరించారు.

నేడు భృంగివాహనసేవ..

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహిస్తారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామిఅమ్మవార్లను భృంగి వాహనంపై ఉంచి ప్రత్యేక పూజల అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలోని మట్టిని సేకరించి సంప్రదాయబద్ధంగా యాగశాలకు తీసుకువచ్చి, ఆ మట్టిని 9 పాలికలలో (మూకుళ్లలో) నింపి దాంట్లో నవధాన్యాలు పోశారు. ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా నంది ధ్వజపటాన్ని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి చండీశ్వరస్వామి సమక్షంలో పూజలు నిర్వహించారు. భేరిపూజలో డోలు వాద్యానికి పూజలు చేశారు. అనంతరం నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

ప్రైవేటు బస్సుల్లో అడ్డగోలు దోపిడీ

- అధిక చార్జీల వసూలు
- అమలుకాని రవాణాశాఖ మంత్రి హామీ
- హైదరాబాద్, బెంగళూరు నుంచి సొంతూరు రావాలంటే భారమే
- సమయానికి రాని ఆర్టీసీ స్పెషల్ బస్సులు



ఆళ్లగడ్డ : సంక్రాంతి రద్దీని ప్రైవేటు ట్రావెల్స్ క్యాష్ చేసుకుంటున్నాయి. టికెట్ ధరలు అమాంతం పెంచేశాయి. ప్రయాణికుల అవసరాన్ని ఆసరా చేసుకుని నిట్టనిలువునా దోపిడీ చేస్తున్నాయి. సాధారణ ధరలకంటే ఒకటికి నాలుగు రెట్లు వరకు వసూలు చేస్తున్నాయి. సంక్రాంతి పండుగ సెలవులకు సొంతూళ్లకు వెళ్తున్న ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు బస్సుల్లో ఒకే చార్జీ ఉండేలా చూస్తామన్న రవాణాశాఖ మంత్రి ఆదేశాలు సైతం ఎవరూ పట్టించుకోవడంలేదు. అధికారులు కూడా మాటలకే పరిమితమయ్యారు. ఆర్టీసీ బస్సులు ప్రకటించిన మేరకు కనిపించకపోవడం.. సాధారణ బస్సుల్లో రిజర్వేషన్లు ఫుల్ కావడం, సీట్లు దొరక్క.. ప్రైవేటు ట్రావెల్స్ అడిగినంత ఇవ్వక తప్పడం లేదు.

జిల్లా వ్యాప్తంగా 700కు పైగా సర్వీసులు

జిల్లా కేంద్రమైన నంద్యాలతోపాటు ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, డోన్ ప్రాంతాల నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులు నిత్యం 700 పైగా రాకపోకలు కొనసాగిస్తున్నాయి. పండుగల సీజన్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సర్వీసులు కూడా నడుపుతున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేనంతగా చార్జీలు పెంచడంతో మధ్యతరగతి కుటుంబాలు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునేవారు సొంతూర్లకు రావాలంటే ఆందోళన చెందుతున్నారు.





నంద్యాల బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అటకెక్కిన రవాణాశాఖ మంత్రి ఆదేశాలు

పండగ సీజన్‌తో పాటు ఏడాది పొడవునా ఏపీఎస్ ఆర్టీసీతో పాటు రాష్ట్రంలో తిరిగే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ఒకే విధమైన చార్జీలు ఉండేలా చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం మోపకుండా సంక్రాంతికి అదనపు సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. గతంలో పండగ సర్వీసులంటే అదనపు భారం ఉండేదని ఇప్పుడా పరిస్థితి లేకుండా చర్యలు తీసుకున్నాం అని ప్రకటించేశారు. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం వేల రూపాయలు టిక్కెట్ ధరలు పెట్టారు. దీనిపై ఎవరూ స్పందించడం లేదు. కొందరు అనుమతి లేని బస్సులను రోడ్డెక్కిస్తుంటే.. మరికొందరు సరైన ఫిట్‌నెస్ లేనివాటినీ తిప్పుతున్నారు.

బాదుడే బాదుడు

హైదరాబాద్ నుంచి ఆళ్లగడ్డకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సుకు చార్జీ రూ. 570 ఉంది. అయితే 11వ తేదీ ప్రైవేట్ బస్సులు వీరబ్రహ్మేంద్ర సర్వీస్ రూ. 1400, శ్రీరుద్ర ట్రావెల్స్ రూ.1750, శ్రీలేఖ్య ట్రావెల్స్ అయితే రూ. 2,564 చొప్పున టిక్కెట్ ధరలు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నాయి. ఎలాగైనా సొంతూర్లకు వెళ్లాలనుకున్న వారు గత్యంతరం లేక భారమైనా ప్రైవేటు బస్సులను ఎక్కాల్సి వస్తోంది.

దందా ఇలా..

ఈ నెల 12 నుంచి 15 వరకు సంక్రాంతి పండుగ సెలవులు ఉన్నాయి. 11వ తేదీ రెండో శనివారం, 12వ తేదీ ఆదివారం కావడంతో విద్యాసంస్థలు 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సెలవులు ప్రకటించాయి. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచే స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ప్రయాణమయ్యారు. దీంతో ఒక్కసారిగా రద్దీ ఏర్పడింది. ఆర్టీసీ బస్సుల్లో సీట్లు లేకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్ దందా కొనసాగిస్తున్నాయి. సాధారణ చార్జీలను ఒక్కసారిగా ఒకటికి నాలుగు నుంచి ఐదు రెట్లు పెంచేశాయి. రైలులో బెర్తులు ఖాళీ లేకపోవడం, ఆర్టీసీ బస్సుల్లో సీట్లు పరిమితంగా ఉండటంతో ప్రయాణికులు తప్పక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.



ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చార్జీలు శనివారం ఇలా చూపిస్తున్నాయి

ఆర్టీసీ బస్సులో సీట్లు లేవు

హైదరాబాద్‌లో నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. సాధారణ రోజుల్లో ఆళ్లగడ్డకు రూ. 500 నుంచి రూ. 550 వరకు చార్జీతో వచ్చేవాళ్లం. ఇప్పుడు ఆర్టీసీ బస్సులో సీట్లు లేక పోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌లో బుక్ చేసుకుంటే రూ. 2750 తీసుకున్నారు. సంక్రాంతి పేరిట అదనంగా టిక్కెట్లపై వసూలు చేస్తుండటం దారుణం.
– ఆళ్లగడ్డ, తులసి

చార్జీలు కట్టడి చేయాలి

హైదరాబాద్‌లోని నేను ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. సంక్రాంతి సెలవులకు ఇంటి వెళ్లాలని 9వ తేదీ ఆన్‌లైన్‌లో చూస్తే ప్రైవేటు బస్సులో టిక్కెట్ ధర రూ. 800 చూపించింది. మరుసటి రోజు చూడగా రూ.1100 చూపిస్తోంది. ఇంక ఆలస్యమైతే మరింత పెరుగుతుందని టిక్కెట్ బుక్ చేసుకుని రావాల్సి వచ్చింది. ప్రభుత్వం చెప్పినట్లు చార్జీలను కట్టడి చేయాలి. లేదంటే మాలాంటి వారు పండుగలకు సొంతూళ్లకు రావాలంటే కష్టమే.
– రాఘవేంద్ర, చాగలమర్రి

క్లుప్తంగా

ఏడు ఎర్రమట్టి ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఎర్రమట్టి ట్రాక్టర్లు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ కోర్టు కేసులో ఉన్న భూముల్లో నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ప్రజల ఫిర్యాదు మేరకు పోలీస్ సిబ్బంది ఎర్రమట్టిని తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. ఎర్రమట్టిని అక్రమంగా తరలించి గ్రామల్లో రోడ్డు పనులకు కాంట్రాక్టర్లు ఉపయోగిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎస్ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

పగిద్యాల: కూలీ డబ్బుల కోసం వెళ్లిన దళితుడిపై పడమర వనుములపాడు గ్రామంలో దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కర్నే మత్తయ్య వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం అదే గ్రామానికి చెందిన రైతు లాజర్ పొలంలో గడెం కొట్టేందుకు పనికి వెళ్లాడు. రాత్రి దినసరి వేతనం రూ. 500 కోసం రైతు ఇంటికి వెళ్లగా అతను విష్ణు అనే వ్యక్తి వద్దకెళ్లి ఆయన ఫోన్ పే చేస్తాడని చెప్పాడు. విష్ణు ఇంటి వద్దకు వెళ్లగా అక్కడ అతని తమ్ముడు భాస్కర్ నాయుడు కనిపించాడు. తన అన్న లేడని ఇంటి వద్ద నుంచి వెళ్లాలని సూచించగా మత్తయ్య అక్కడే కూర్చోవడంతో భాస్కర్ నాయుడు కోప్రోద్రిక్తుడై తలపై రాయితో మోదీ గాయపర్చాడు. తలకు బలమైన గాయం కావడంతో బాధితుడు ముచ్చుమర్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు.

హరికిషన్‌కు చిన్న బుచ్చి నాయుడు స్మారక పురస్కారం



హరికిషన్

కర్నూలు కల్చరల్: ప్రముఖ కథా రచయిత బాల సాహితీవేత్త డాక్టర్ ఎం.హరికిషన్‌కు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి తరఫున ప్రఖ్యాతి చెందిన చిన్నబుచ్చినాయుడు స్మారక పురస్కారాన్ని ప్రకటించారు. ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు చిత్తూరు జిల్లా పలమనేరులోని కళా మందిరంలో పురస్కారాన్ని అందించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కె.పుష్ప తెలిపారు. ఈయన కర్నూలు జనజీవనాన్ని చిత్రిస్తూ అనేక కథలు రచించడమే కాక రాయలసీమ కథా సాహిత్యాన్ని ఇప్పటితరానికి తెలియజేయడం కోసం సంకలనాలు ప్రచురిస్తున్నారు. బాలల కోసం నిరంతరం ప్రయోగాలు చేస్తూ అతి సులభమైన పదజాలంతో కథలు, గేయాలు రచించడమే కాక స్వయంగా వాటిని చెబుతూ యూట్యూబ్ ద్వారా పిల్లలందరికీ అందుబాటులోకి తెస్తున్నారు. ఈయన 80కి పైగా కథా పుస్తకాలు రాశారు. ఆయన విశేష సాహిత్య కృషిని గుర్తించి పలమనేరుకు చెందిన సాహిత్య అభిమాని తులసినాదం నాయుడు తన తండ్రి పేరు మీద నెలకొల్పిన ఈ అవార్డును, తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర్ ప్రసాద్, ప్రముఖ శతావధాని ఆముదాల మురళి చేతుల మీదుగా అందజేయనున్నారు.

శ్రీశైలంలో రేపు వార్షిక ఆరుద్రోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం మల్లికార్జున స్వామివారికి వార్షిక ఆరుద్రోత్సవం నిర్వహించనున్నారు. ఆరుద్రోత్సవాన్ని ప్రతి నెలలో మాసోత్సవంగా నిర్వహిస్తుండగా, ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున మాత్రం వార్షిక ఆరుద్రోత్సవం జరిపిస్తారు. ఆదివారం రాత్రి స్వామివారికి లింగోద్భవకాల రుద్రాభిషేకం చేస్తారు. సోమవారం ఉదయం ముఖమండప ఉత్తర ద్వారాన్ని తెరచి భక్తులకు ఉత్సవమూర్తుల ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. అనంతరం క్షేత్ర ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

క్షుద్రపూజలు చేస్తూ ఇద్దరు అరెస్ట్

- పోలీసులపై దాడి చేసిన నిందితులు

ఆదోని అర్బన్: పట్టణంలో క్షుద్ర పూజలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రామలింగయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామ్‌నగర్‌కు చెందిన తెలగంశెట్టి వెంకటేశ్వర్లుకు ఆర్థిక, ఆరోగ్య పరిస్థితి సరిగా లేనందువల్ల హైదరాబాద్‌కు చెందిన తాటికొండ బాలరాజు అనే దొంగస్వామి పరిచయమయ్యాడు. ఇలాంటి సమస్యకు క్షుద్రపూజలు చేస్తే పరిష్కారమవుతుందని నమ్మ బలికించాడు. దీంతో సుమారుగా రూ.10 లక్షలు మాట్లాడుకుని విడతల వారీగా కొంత డబ్బును తీసుకున్నాడు. ఈనెల 10వ తేదీన శుక్రవారం సీతారామనగర్‌లో క్షుద్ర పూజలు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న తెలగంశెట్టి వెంకటేశ్వర్లు, దొంగస్వామి తాటికొండ బాలరాజు పోలీసులపై కట్టెలతో దాడి చేశారు. త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఇంటి యజమాని, దొంగస్వామిని అరెస్టు చేసి, విధులకు ఆటంకం కలిగించారన్న విషయంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్లాబ్ విరిగిపడి కార్మికుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు

బొమ్మలసత్రం: పాత భవనాన్ని కూలుస్తుండగా ప్రమాదవశాత్తు స్లాబ్ విరిగిపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. అవుట్‌పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. మహానంది మండలం గాజులపల్లికి చెందిన నాగరాజు (25) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నంద్యాల పట్టణంలోని ప్రియాంక నగర్‌లో పాత భవనం కూల్చేందుకు యజమానితో పని కుదుర్చుకున్నాడు. ఈక్రమంలో ఉదయం తనతో మరో ఇద్దరు కార్మికులను తీసుకెళ్లి పనిమొదలుపెట్టాడు. భవనంపై ఉన్న స్లాబ్‌ను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కొంత భాగం విరిగి నాగరాజుపై పడింది. స్థానికులు జేసీబీ సహాయంతో విరిగిపడిన స్లాబ్‌ను తొలగించే లోగా అతను మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్ : నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. జి.పుల్లారెడ్డి కళాశాల, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ కాంపిటీషనల్ మేథమ్యాటిక్స్ అండ్ అప్లయిడ్ ఫిజికల్ సైన్స్' అనే అంశం మీద సదస్సు జరిగింది. రాయలసీమ యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ముఖ్య వక్తలుగా సింగపూర్ నుంచి మనోజ్ గుప్తా, టి క్వాస్ నుంచి కుస్‌గావ్, ఏషియన్ జనరల్ ఆఫ్ కెమిస్ట్రీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ డాక్టర్ హిమాన్షు అగర్వాల్, గుజరాత్ నుంచి ప్రొఫెసర్ బప్పిపాల్ పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో వివిధ ప్రాంతాల శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి రోల్ బాల్ పోటీలు



జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న రాజస్థాన్ బాలుర జట్టు

కర్నూలు (టౌన్) : మూడు రోజుల పాటు నగర శివారులోని లక్ష్మీపురం రిడ్జ్ పాఠశాలలో నిర్వహించిన 16 వ జాతీయ స్థాయి రోల్ బాల్ పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. విజేతలుగా బాలుర విభాగంలో రాజస్థాన్, బాలికల విభాగంలో అస్సాం రాష్ట్రాల జట్లు నిలిచాయి. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ ఆయా జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేసి మాట్లాడారు. దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలకు హాజరు కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. చదువు, క్రీడలను విద్యార్థులు సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ మోహన్ కుమార్, పాఠశాల సీఈఓ జి. గోపీనాథ్, రోల్‌బాల్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, రోల్ బాల్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ కన్వీనర్ సునీల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా బాలుర విభాగంలో తమిళనాడు (రెండో స్థానం), గుజరాత్ (మూడవ స్థానం), బాలికల విభాగంలో రాజస్థాన్ (రెండో స్థానం) మహారాష్ట్ర (మూడో స్థానం)లో నిలిచాయి.

పాము కాటుతో వ్యక్తి మృతి

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామానికి చెందిన బోయ లక్ష్మన్న(62) పాముకాటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మన్న శుక్రవారం పొలానికి వెళ్లి సాయంత్రం వరకు కంది పంటకు కోతులు రాకుండా కావలి ఉండి సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో చీకటిలో కనిపించక పాముపై తొక్కడంతో అది అతని కాలుపై కాటు వేసింది. విషయాన్ని వెంటనే ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు తెలుపగా వెంటనే ఆతన్ని బైక్‌పై డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుని కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కర్నూలు: మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన మహేష్ (29) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మహేష్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆటో ఖర్చులు, కుటుంబ పోషణ నిమిత్తం అప్పు చేసి తిరిగి చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చినవారు ఒత్తిడి పెంచారు. దీంతో శుక్రవారం గ్రామ శివారులోని కేసీ కెనాల్ గట్టు వద్ద పురుగుల మందు తాగి స్నేహితుడు వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి విషయం తెలియజేశాడు. దీంతో అతను అక్కడికి వెళ్లి మహేష్‌ను కర్నూలులోని ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించాడు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయడంతో భార్య మాధవి ఆసుపత్రికి చేరుకుంది. చికిత్స పొందుతూ కోలుకోలేక అతను అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కొడుకు సంతానం. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

నందవరం: మండల కేంద్రం నందవరంలో శనివారం కర్నూలు స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నందవరం గ్రామానికి చెందిన బోయ అచ్చెన్న గంజాయి తరలిస్తున్నాడని సమాచారంతో కర్నూలు స్పెషల్ పార్టీ పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. నందవరం – హాలహర్వి రోడ్డులో ఉన్న అచ్చెన్నను అదుపులో తీసుకుని 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి పత్తి కొనుగోలు నిలుపుదల

ఆదోని అర్బన్: సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు సీసీఐ పత్తి కొనుగోలు ఉండదని సీసీఐ ఇన్‌చార్జ్‌లు భరత్, గౌతమ్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు పండగ ఉండడం వల్ల రైతులు ఈ విషయాన్ని గమచించి సీసీఐ కొనుగోలు కేంద్రానికి తరలించవద్దని తెలియజేశారు.

భార్యతో గొడవ పడి ఆత్మహత్య

కర్నూలు: గొందిపర్ల గ్రామానికి చెందిన యుగంధర్ (30) భార్య భారతితో గొడవ పడి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన పెళ్లి చేసుకున్నప్పటి నుంచి కర్నూలులోని చిత్తారి వీధిలో నివాసముంటూ గొండ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆర్థిక సమస్యలతో కొంతకాలంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఇదే విషయంలో భార్య తో గొడవ పడి శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. వీరికి ఒక కుమారుడు సంతానం.



సీ క్యాంప్ సమీపంలో రంగులు, ముగ్గు పిండి అమ్మకాలు లేక దిగాలు ఉన్న వ్యాపారులు

చిన్నబోయిన చిరువ్యాపారం



గాలి పటాల దుకాణం

సంక్రాంతి పండుగ వస్తుంటే ఒకప్పుడు చిరు వ్యాపారులు ఉత్సాహంగా ఉండేవారు. వ్యాపారం బాగా జరుగుతుందని, లాభాలు వస్తాయని సంబరం చేసుకునేవారు. నేడు పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. ఇళ్ల ఎదుట ముగ్గులు వేయడానికి కనీసం రంగులు కొనేవారు కరువయ్యారు. పూలు విక్రయాలు కూడా ఊపందుకోలేదు. గాలి పటాల అమ్మకాలు అరకొర సాగుతున్నాయి. ఆర్థిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ప్రజలు మార్కెట్‌కు రావడం లేదు. పండుగ సామగ్రి కొనుగోలు చేయడం లేదు. కర్నూలు నగరంలో చాలా చోట్ల సంక్రాంతి కొనుగోళ్లు లేక చిరు వ్యాపారం చిన్నబోయింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు